క్లుప్తంగా

మంత్రి తుమ్మల పరామర్శ



పేరయ్యను పరామర్శిస్తున్న మంత్రి

ఇల్లెందు: ఇల్లెందు పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కనగాల పేరయ్యను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఆదివారం ఇల్లెందులోని పేరయ్య స్వగృహానికి విచ్చేశారు. ఇటీవల పేరయ్య గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ మేరకు ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇల్లెందుల పాడు సమీపంలో ప్రభునాథ్ ఇంటికి వెళ్లే రహదారి అసంపూర్తిగా ఉండటంతో ఆయన తుమ్మల దృష్టికి తీసుకు రాగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయించాలని కోరారు. తుమ్మలను కలిసిన వారిలో ప్రభునాథ్, కొప్పుల సమ్మయ్య, పరుచూరి వెంకటేశ్వరరావు, మల్లూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పలువురికి ఎమ్మెల్యే..



విజయ బంధువు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: పట్టణంలో పలువురిని ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించారు. ఆదివారం పట్టణ, మండల కాంగ్రెస్ నేతలతో కలిసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఘనశ్యామ్ లహోటీ కుటుంబాన్ని, హరిహర క్షేత్రం డైరెక్టర్ బొందిలి విజయ సమీప బంధువు మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. మోకాలి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి పొందుతున్న మైనార్టీ నేత గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే జుగల్ కిషోర్ ఖండేల్‌వాల్ సోదరుడు దీనదయాళ్ ఖండేల్‌వాల్ అనారోగ్యం బారిన పడటంతో అయనను పరామర్శించారు. కూరగాయల వ్యాపారవేత్త భాస్కర్ కుమారుడు మృతి చెందగా ఆయనను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో బోల్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, పింగళి నరేష్, సీహెచ్ శంకర్, వసంత్, పెండ్యాల రాజు తదితరులు ఉన్నారు.

డాక్టర్ సావిత్రికి ఎమినెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సావిత్రి


సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి ఆదివారం రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఎమినెన్స్ అవార్డు ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ – 2025 పురస్కారాన్ని అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వాసవీ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయిలో క్రీడలలో చేసిన సేవలకు గుర్తింపుగా సావిత్రి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్, కళాశాల కరస్పాండెంట్ కె.సునీల్‌కుమార్ అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

జాతర పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

టేకులపల్లి: టేకులపల్లి మండలం కొండంగుల బోడులోని శ్రీ కొత్తకొండ వీరభద్రస్వామి, భద్రకాళిమాత ఆలయంలో ఈనెల 25 నుంచి మార్చి 12 వరకు జరిగే మహాశివరాత్రి, స్వామి కళ్యాణం, జాతర వేడుకలను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత కోరం సురేందర్, ఆలయ పూజారి కేళోతు శంకర్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి జాతర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జరుపుల దస్రు నాయక్, జరుపుల లచ్చు నాయక్, జరుపుల వీరసింగ్ నాయక్, జరుపుల వీరన్న నాయక్, జరుపుల బాలాజీ, కేళోతు వీరన్న, జరుపుల అశోక్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా జిల్లా ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించి క్లిష్టమైన పాఠ్యాంశాలను అర్థమయ్యేలా తిరిగి బోధిస్తున్నారు. ఆయా పాఠ్యాంశాలపై వారాంతంలో విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన తప్పిదాలను దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ అధికారులు గత సెప్టెంబర్ చివరి వారం నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి
- అదనపు తరగతుల నిర్వహణ
- మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు వార్షిక పరీక్షలు



మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

సుజాతనగర్: మండలంలోని సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 96 మంది, గరీబ్‌పేటలో 15 మంది, సింగభూపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు, సర్వారం ఆశ్రమ పాఠశాలలో 35 మంది, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 59 మంది చొప్పున మొత్తం 210 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి చదువుతున్నారు. అధ్యయనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి క్లిష్టమైన పాఠ్యాంశాలను అర్థమయ్యేలా తిరిగి బోధిస్తున్నారు. చాలా పాఠశాల్లో ఇప్పటికే సిలబస్ పూర్తి చేశారు. దీంతో ప్రత్యేక పరీక్షలను నిర్వహించి, విద్యార్థుల్లో ఉన్న భయందోళనను పోగొడుతున్నారు. ఆయా పాఠ్యాంశాలపై వారాంతంలో విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహించనున్నారు.

ప్రత్యేకంగా ప్రశ్నలు రూపొందించి..

ప్రతీ ప్రభుత్వ పాఠశాలలోనే ఉపాధ్యాయులు ప్రతీ సబ్జెక్ట్‌కు సంబంధించి ప్రత్యేకంగా ప్రశ్నలు రూపొందించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. అదనపు తరగతుల సమయంలో విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం సైతం అందజేస్తోంది. గతంలో జరిగిన తప్పిదాలను దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ అధికారులు గత సెప్టెంబర్ చివరి వారం నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

రోజుకో సబ్జెక్ట్‌పై రివిజన్..

ప్రత్యేక తరగతుల సమయంలో ప్రతీరోజు సబ్జెక్ట్‌కు సంబంధించి పాఠ్యాంశాలను రివిజన్ చేయడంతో పాటు పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు. ఆయా పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

సబ్జెక్టుల వారీగా పరీక్షల నిర్వహణ..



సబ్జెక్టుల వారీగా ప్రతీరోజు పరీక్షలు నిర్వహించి మార్కులు తెలియజేస్తున్నారు. తక్కువగా వచ్చిన విద్యార్థులు సబ్జెక్టుల వారీగా సామర్థ్యాలను పెంపొందించుకుని ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి ఉపయోగపడుతుంది.

– నితీష్, పదోతరగతి, జెడ్పీఎస్ఎస్, సుజాతనగర్

ప్రతీరోజు ప్రత్యేక తరగతులు..



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు రోజుకు రెండున్నర గంటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్ట్‌ల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ప్రతీరోజు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

– రుచిత, పదోతరగతి, జెడ్పీఎస్ఎస్, సుజాతనగర్

లక్ష్యాన్ని నిర్దేశించాం..



మండలంలో అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు లక్ష్యాన్ని నిర్ణయించాం. ఈ మేరకు చేరుకోవాలని హెచ్‌ఎంలను ఆదేశించాం. ఆయా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వంద శాతమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

– లూనావత్ లీల, ఎంఈఓ, సుజాతనగర్

ఏజెన్సీలో గౌడలను ఎస్టీలో చేర్చాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఇల్లెందురూరల్: ఏజెన్సీ ప్రాంతాలలో గౌడ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏజెన్సీ గౌడ సంఘం పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నరాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని ముకుందాపురం గ్రామంలో శ్రీరాం కోటయ్య అధ్యక్షతన ఆదివారం ఏజెన్సీ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఏజెన్సీలో నివసిస్తున్న గౌడ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చి న్యాయం చేసినప్పటికీ తదనంతర పాలకులు ఎస్టీ జాబితా నుంచి తొలగించారని వాపోయారు. ఏజెన్సీలో అన్ని కులాలకు వృత్తిపరమైన సొసైటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందిస్తున్నప్పటికీ గౌడ సొసైటీలను రద్దు చేయడం తోపాటు ఇతర సదుపాయాలకు కూడా నోచుకోకుండా గౌడలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష సభ్యుడిగా అసెంబ్లీలో ప్రస్తావించారని, తమ సమస్యపై అవగాహన కలిగి ఉన్న ఆయన రాజ్యాంగంలో తమకు కల్పించిన హక్కులను అమలు చేయాలని కోరారు. తమను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మోడెం వెంకన్న, ఉమ్మగాని సత్యం, బసవ వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, తిరుపతి, ఎల్లయ్య, సాయన్న, సంపత్, పబ్బు శ్రీను, ఐలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన జీవనం అలవర్చుకోవాలి

ఇల్లెందురూరల్: విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆదర్శవంతమైన జీవన విధానం అలవర్చుకోవాలని మదర్సా నజీమ్‌వభాని మహమ్మద్ మౌలానా ఇనాయితుల్లా రషీద్ అన్నారు. మండలంలోని మోదుగులగూడెం మదర్సాలో ఆదివారం మంచి నడవడికకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముస్లిం యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. దేవునిపై భక్తితో రోజువారీ కార్యక్రమాలను ప్రారంభించాలని, ఇతరులకు మంచి చేయాలన్న తపన కలిగి ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, బాగా చదువుకొని ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. హాఫీజ్ ఖాజా ఫర్కార్ ఎండీ ఇబ్రహీం, మౌలానా మహమ్మద్ సలామితుల్లా పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయాలను కొనసాగిద్దాం..



పడమటనర్సాపురంలో పూజలు చేస్తున్న వైరా ఎమ్మెల్యే, అధికారులు, కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు: బంజార గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు పడమటనర్సాపురం శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించింది. జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే శ్రీ జగదాంబ అమ్మవారు, శ్రీ సేవాలాల్ మహరాజ్ చిత్రపటాలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూలూరుపాడు, ఏన్కూరు, కొణిజర్ల, కారేపల్లి మండలాధికారులు, అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, బంజారా గిరిజన పెద్దలు, సాధులు హాజరయ్యారు. భోగ్‌బండారో(నైవేద్యాన్ని) సేవాలాల్ మహారాజ్‌కు అధికారులు, సాధులతో కలిసి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, తహసీల్దార్ స్వాతి బిందు, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, ఏఓ దీపక్ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, బీజేపీ జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రం, లేళ్ల గోపాల్‌రెడ్డి, బాదావత్ వెంకట్రామ్, ధరావత్ కాన్షీరామ్, లకావత్ లచ్చు నాయక్, బానోత్ నవీన్, వాంకుడోత్ కిషన్ నాయక్, ధరావత్ రాంబాబు, సాధులు, బంజార గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

టేకులపల్లి: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు జగ్గు దాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో సేవాలాల్ 286వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాటి నాగేశ్వరావు, సువన్, మంగీలాల్, కిషన్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

పాల్వంచ: పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004–05లో పదో తరగతి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, నాగేశ్వరరావు, సుధాకర్, పద్మలత, జేవీఆర్ శ్రీనివాస్, వీటీఆర్, కూర్మేశ్వర్‌రావు, సీతా రామలక్ష్మి, శారద, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చదువు తలరాతను మార్చుతుంది..



దుస్తులు అందజేస్తున్న ఎంఈఓ ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: చదువే తలరాతను మార్చుతుందని కొత్తగూడెం మండల విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రభుదయాళ్ అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించి మాట్లాడారు. రెసిడెన్షియల్ స్కూల్‌లో పేద విద్యార్థులు, వీధిబాలురు, పాక్షికంగా తల్లిదండ్రులను కోల్పోయిన బాలురు విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నీతి కథలు, మహానుబావుల చరిత్ర, చదువుకు గల శక్తిని వివరించారు. తాను చిన్నతనంలో పడిన ఇబ్బందులను వివరించి చదువే తలరాతను మార్చుతుందని పేర్కొన్నారు. ఇటీవల పాఠశాలలో చేరిన ఆరేళ్ల వయస్సు గల అజయ్ తల్లిదండ్రులను కోల్పోయాడు. అజయ్‌కు నూతన దుస్తులు అందజేశారు.

ఏజెన్సీ ఎస్సీలను ఆదుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: తరతరాలుగా ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఎస్సీ కులాలపై ప్రభుత్వాలు సవితి తల్లి ప్రేమ కనబరుస్తున్నాయని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతంలో తరతరాలుగా నివసిస్తున్న ఎస్సీ కులాలను ప్రభుత్వాలు జనాభా లెక్కకు మాత్రమే ఉపయోగిస్తున్నాయని, అభివృద్ధికి నోచుకోని ఎస్సీ కులాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు సగం భూభాగం వెనకబడ్డ ఏజెన్సీ జిల్లాలు ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, మహబూబ్‌నగర్ ఉమ్మడి నాలుగు జిల్లాలు 75 మండలాలు సుమారు పది లక్షల జనాభా కలిగిన ఎస్సీ కులాల నిరుపేదలకు రాజ్యాంగపరమైన స్థానిక రిజర్వేషన్ విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ వరమైన అవకాశాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలో తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలు నిరక్షరాస్యులు, నిరుపేదల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నపాలు చేసిన పట్టించుకోవటం లేదని ఆరోపించారు. పాలన మారినా.. పాలకులు మారినా.. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలను నాన్ ట్రైబ్స్‌గా అపనింద వేసి హక్కులకు దూరం చేస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాలు దిక్కులేని ప్రజలు కారని, అంబేద్కర్ వారసులు భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్ కోసం దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: రోడ్లు, తాగునీటి సౌకర్యం లేని గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తద్వారా ప్రభుత్వ నుంచి నిధులు మంజూరు చేసేవిధంగా చూస్తామని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. మండల పరిధిలోని యానంబైల్, కిన్నెరసాని గ్రామాల్లో ఆదివారం శాఖగ్రామ మహాసభలు కొంగర అప్పారావు, వడ్డే వెంకటేశ్వర్ల అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకున్న అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. రెండు గ్రామాలకు చెందిన పది కుటుంబాలు సీపీఐలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిన్నెరసానిలో 17 మంది, యానంబైల్ గ్రామంలో 15 మందితో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నిమ్మల రాంబాబు, విజయ్‌కుమార్, సుభద్ర, లక్ష్మి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు వితరణ



ప్యాడ్లు అందజేస్తున్న రాజారత్నం

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి 30 మంది విద్యార్థులకు ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం డీఆర్‌డీఏ కార్యాలయ ఉద్యోగి దారా రాజారత్నం, సులోచన దంపతులు, వారి కుమార్తె సింగరేణి వెల్ఫేర్ ఆఫీసర్ కావ్య ప్యాడ్లు, కంపాక్స్‌లు వితరణ చేశారు. మార్చి 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాసి, నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మిర్యాల రమేష్, వరుణ్, చక్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు ఖర్చు భారం..

- ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ మార్కెట్లకు తరలింపు
- లక్షల బస్తాలతో పోటెత్తుతున్న మిర్చి మార్కెట్లు
- ఒక్కో రైతుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల అదనపు ఖర్చు
- ఇల్లెందులో మిర్చి కొనుగోళ్లు ప్రారంభించాలని వినతి



మార్కెట్ పరిధిలో ఓ రైతు కల్లంలో పంటను పరిశీలిస్తున్న సెక్రెటరీ నరేష్

ఇల్లెందు: రైతులు ఆరుగాలం కష్టపడి మిర్చి పంట సాగు చేస్తే స్థానికంగా మార్కెట్ సదుపాయం లేదు. దూరప్రాంతాలకు తరలిస్తే ఒక్కో రైతుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చు అదనంగా వస్తోంది. ఇల్లెందు, టేకులపల్లి మండలాల నుంచి సుమారు 3 లక్షల మిర్చి బస్తాలు ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ మార్కెట్లకు తరలిపోతోంది. సకాలంలో అమ్మకం జరగక నాలుగైదు రోజులు పడిగాపులు పడుతున్నారు. అకాల వర్షం సంభవిస్తే పరిస్థితిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆరు మార్కెట్ యార్డులలో మిర్చి కొనుగోళ్లు జరగటం లేదు. 2022లో కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో కొనుగోలు చేశారు. ఆ తరువాత మిర్చి కొనుగోళ్ల మీద దృష్టి సారించలేదు. ఇల్లెందు మార్కెట్ పరిధిలో ఎనిమిది మండలాలు ఉన్నాయి. ఇల్లెందు, టేకులపల్లి, కారేపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం మండలాల్లో మిర్చి పంట పెద్దమొత్తంలో సాగవుతుంది. గార్ల, బయ్యారం మండలాల్లోని రైతులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు మిర్చిని అమ్మకానికి తరలిస్తుంటారు. ఇక కామేపల్లి, కారేపల్లి మండలాల రైతులు దూరాభారమైన ఖమ్మం మార్కెట్‌కు వెళ్తుంటారు. ఇక ఇల్లెందు మండలానికి ఏ అవకాశమూ లేదు. ఇక్కడి రైతులు మహబూబాబాద్, ఖమ్మం మార్కెట్‌లు సమాన దూరంలో ఉన్నాయి. ఇల్లెందులో మిర్చి కొనుగోళ్లు జరిగితే సుమారు ఐదు లక్షల బస్తాల వరకు ఇక్కడే కొనుగోలు జరిగే అవకాశం ఉంటుంది. ఇల్లెందు మండలంలో ముకుందాపురం, మాణిక్యారం, పోలారం, కొమరారం, బయ్యారం మండలంలోని గంధంపల్లి, కొత్తపేట, సంతులాల్‌పోడుతండా, సింగారం, వెంకట్రాంపురం, చోక్లాతండా, ఉప్పలపాడు, బాలాజీపేట, కామేపల్లి మండలంలోని తాళ్లగూడెం, కొత్తలింగాల, మద్దులపల్లి, ముచ్చర్ల, సాతానిగూడెం, కెప్టెన్‌బంజర, గోవింద్రాల, టేకులపల్లి మండలంలో బేతంపూడి, సులానగర్, ముత్యాలంపాడు, బొమ్మనపల్లి, బోడు, సంపత్‌నగర్, తడికెలపూడి తదితర ప్రాంతాల్లో మిర్చి ఎక్కువ పంట పండింది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.14 వేల వరకు ధర పలుకుతోంది. ఇల్లెందు మార్కెట్ యార్డులో సుమారు 6 ఎకరాల స్థలం గోదాంలు, షెడ్లు ఉన్నాయి. సిబ్బంది కూడా తగినంత మంది ఉన్నారు.

కల్లాల్లో ఆరబెట్టుకుంటున్న రైతులు...

నెల రోజులుగా ఏ రైతు చేను వద్ద చూసినా కల్లంలో మిర్చి కుప్పలే దర్శనం ఇస్తున్నాయి. పిల్లాపాపలతో మిర్చి రైతులు చేను వద్ద ఏరిన మిర్చిని కల్లాల్లో ఆరబెట్టి మార్కెట్‌లకు తరలించాలని సమాలోచనలు చేస్తున్నారు. అయితే అటు ఖమ్మం, ఇటు మహబూబాబాద్ మార్కెట్లు మిర్చి బస్తాలతో కిక్కిరిసిపోతున్నాయి. అక్కడి మార్కెట్‌లకు మిర్చి బస్తాలను తరలిస్తే కనీసం కిందికి దించేందుకు స్థలం కూడా ఉండడం లేదని పలువురు రైతులు కల్లాలోనే ఎదురుచూపులు చూస్తున్నారు.



ఇల్లెందు మార్కెట్ కార్యాలయం

ఇల్లెందులో కొనుగోళ్లు చేయాలి..



ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు చేస్తే ఇక్కడి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇక్కడి మిర్చిని ఖమ్మం, మహబూబాబాద్ తరలిస్తే వారం రోజులు అక్కడి మార్కెట్‌లో సరుకు వద్ద కాపలా కాయాల్సి వస్తోంది. తక్షణం జిల్లా అధికారులు స్పందించి ఇల్లెందులో కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలి. మిర్చి రైతులకు మేలు చేయాలి.

– బందారి నాగేశ్వరరావు, రైతు, తొడిదెలగూడెం

నేటి నుంచి కొనుగోళ్లు..



ఇల్లెందు మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు ప్రారంభించబోతున్నాము. సోమవారం నుంచి టేకుపల్లి సబ్ యార్డులో కొనుగోళ్లు జరగనున్నాయి. ఇప్పటికే మిర్చి కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారులకు 15 మందికి నోటీసులు ఇచ్చాము. మరో 15 మందికి లైసెన్సులు ఇస్తాం. కొంతమంది అనధికారికంగా కొనుగోళ్లు చేస్తున్నారు. చర్యలు తీసుకుంటాం.

– నరేష్, మార్కెట్ సెక్రెటరీ, ఇల్లెందు